
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
మంగళవారం 18 మార్చి 2025





శ్రీకాకుళం ఎన్టీఆర్ ఉన్నత పాఠశాల కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



శ్రీకాకుళంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు



నరసన్నపేటలోని పరీక్ష కేంద్రం వద్ద రూమ్ నెంబర్లు చూస్తున్న విద్యార్థులు

పదో తరగతి పరీక్షలు ప్రారంభం

● తొలిరోజు 217 మంది విద్యార్థుల గైర్హాజరు

గుజరాతీపేట, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 149 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులు ఉరుకులు, పరుగులతో పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. జిల్లా వ్యాప్తంగా తొలిరోజు తెలుగు పరీక్షకు 28,189 మంది రెగ్యులర్ విద్యార్థులకు గానూ 28,071 మంది హాజరయ్యారు. 118 మంది గైర్హాజరయ్యారు. ఓపెన్ విధానం పరీక్షలకు సంబంధించి 168 మందికిగాను 69 మంది హాజరయ్యారు. 99మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా 217 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఈవో ఎస్.తిరుమల చైతన్య తెలిపారు.

● శ్రీకాకుళంలోని ఎన్టీఆర్ మునిసిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పరిశీలించారు. సదుపాయాల కోసం ఆరా తీశారు. విద్యార్థులకు తాగునీరు సమస్య లేకుండా చూడాలని సూచించారు.



శ్రీకాకుళంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

పదో తరగతి విద్యార్థి అదృశ్యం

● తల్లిదండ్రులు మందలించారని..



విక్రాంత్(ఫైల్)

కోటబొమ్మాళి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళి మేజర్ పంచాయతీ పరిధి జగనన్న కాలనీకి చెందిన పదో తరగతి విద్యార్థి సంపతిరావు విక్రాంత్ అదృశ్యమయ్యాడని స్థానిక ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. విక్రాంత్ సోమవారం నుంచి పదోతరగతి పరీక్షలు రాయాల్సి ఉంది. కాగా ఆదివారం చదువు విషయంలో తల్లిదండ్రులు సంపతిరావు రమేష్, రేవతి మందలించా రు. బయట తిరగకుండా బాగా చదువుకుని పరీక్షలు రాయాలని చెప్పారు. దీంతో మధ్యాహ్నం ఇం టి నుంచి విక్రాంత్ బయటకు వెళ్లిపోయాడు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెంది గాలించారు. బంధువుల ఇంట్లో కూడా లేకపోవడంతో తమ కుమారుడు కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

● గంజాయి అరికట్టేందుకు ప్రత్యేక బృందం
● 'శక్తి'తో మహిళల భద్రత
● హైవేపై ద్విచక్ర వాహనాలతోనూ పెట్రోలింగ్
● ప్రతి ఆటో సీటు వెనుక క్యూఆర్ కోడ్
● పోలీసు సిబ్బంది పనితీరుపైనా ఆరా
● జిల్లా కేంద్రంలో సైబర్‌సెల్ ఏర్పాటు చేస్తాం
● ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

ఈగల్ టీమ్ వస్తోంది

శ్రీకాకుళం, శ్రీకాకుళం క్రైం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): 'జిల్లాలో ప్రజల భద్రత, సంరక్షణే ధ్యేయం. అసాంఘిక శక్తులను అరికట్టేందుకు, మాదకద్రవ్యాలు, గంజాయి రవాణాను కూకటివేళ్లతో పెకిలించేందుకు ఎలైట్‌యాంటీ నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్(ఈగల్) టీమ్ వస్తోంద'ని ఎస్పీ మహేశ్వరరెడ్డి వెల్లడించారు. 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు పోలీసులు అందిస్తున్న సేవలను వివరించారు. మహిళల భద్రత, సైబర్ నేరాల కట్టడి, అర్జీదారుల వినతులపై సంతృప్తిస్థాయి, పోలీసులపై వస్తున్న ఆరోపణలపై సమగ్రంగా జవాబులు ఇచ్చారు.

ప్రశ్న: జిల్లాలో ఎక్కడ చూసినా గంజాయి లభ్యమవుతోంది కదా?

జవాబు: గంజాయి రవాణాను పూర్తిస్థాయిలో నియంత్రించేందుకు ప్రత్యేక దృష్టి సారించాం. ఎక్కడికక్కడ తనిఖీలు చేస్తున్నాం. ఈ క్రమంలో పెద్ద ఎత్తున గంజాయి నిల్వలు పట్టుబడుతూనే ఉన్నాయి. పట్టుబడిన గంజాయి రవాణాదారులు, వ్యాపారుల నుంచి సమాచారం తీసుకుని.. ప్రత్యేక బృందాలతో నిఘా వ్యవస్థ బలోపేతం చేశాం. గంజాయిని కూకటివేళ్లతో పెకిలించేందుకు కొత్తగా 'ఈగల్' టీమ్ వస్తోంది. ఇందులో సీఐ ర్యాంకు అధికారితో పాటు.. ఆరుగురు సిబ్బంది ఉంటారు. వారి విధులు కేవలం గంజాయి మూలాలు తెలుసుకుని నిర్మూలించడమే. నేరస్థుల కదలికపై నిఘాతోపాటు సరిహద్దుల్లోనూ అక్కడి పోలీసులు, ఇతర అధికారులను సమన్వయం చేస్తూ గంజాయి నిర్మూలనకు శాశ్వత అడ్డుకట్ట వేస్తారు.

● **ప్రశ్న: జిల్లాకో సైబర్‌సెల్ ఏర్పాటు చేస్తారా?**

జవాబు: శ్రీకాకుళంలో త్వరలో సైబర్‌సెల్ ఏర్పాటు కానుంది. ఇందులో సాంకేతిక పరిజ్ఞానం ఉన్నవారిని ప్రత్యేక సిబ్బందిగా నియమిస్తాం. ఇతర సంస్థల సహకారంతో సైబర్‌సెల్ నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నాం. సైబర్ నేరాలపై వెంటనే స్పందించి నష్ట నివారణను అరికట్టేలా చర్యలు తీసుకునేందుకు వీలుంటుంది. సైబర్ కేసుల్లో బాధితులకు న్యాయం లభించేలా పోలీసుల దర్యాప్తు జరుగుతోంది. జిల్లాలో ఇప్పటికి 13 కేసుల్లో రూ.20.85 లక్షలు బాధితులకు అందజేయాలని కోర్టు నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. మరో 34 కేసులను కోర్టులో ఫైల్ చేశాం. రూ.61,54,384 విడుదలకు రేపోమాపో ఉత్తర్వులు విడుదలవుతాయి. ఇంకా 24కేసులకు సంబంధించి (విలువ రూ. 28.16లక్షలు) ఫైల్ చేయాల్సి ఉంది. బాధితులకు డబ్బులు తిరిగి చెల్లించే విషయంలో విజయవాడ, విశాఖపట్నం తర్వాత

(మిగతా 6వ పేజీలో..)

సంతలే టార్గెట్!

● భారీగా పశువుల క్రయవిక్రయాలు
● రైతుల రూపంలో దళారుల ప్రవేశం
● కబేళాలకు తరలిస్తున్న వైనం



● లావేరు మండలం బుడుమూరులో ప్రతీ సోమవారం సంత జరుగుతుంది. దాదాపు మూడు జిల్లాల నుంచి రైతులు ఇక్కడకు వచ్చి పశువులు క్రయవిక్రయాలు చేస్తుంటారు. గతంలో పశువులను నడిపించుకొని రైతులు సంతకు తెచ్చేవారు. కానీ ఇప్పుడు వాహనాల్లో తెస్తున్నారు. అందులో రైతులు ఎవరు? కబేళాలకు తరలించే వ్యాపారులు ఎవరో తెలియని పరిస్థితి..

● ఆమదాలవలస సమీపంలోని చింతాడ వద్ద ప్రతీ శనివారం సంత జరుగుతుంది. అక్కడ ప్రతీవారం రూ.లక్షల్లో పశువుల వ్యాపారాలు జరుగుతుంటాయి. అయితే వివిధ ప్రాంతాల నుంచి రైతుల కంటే వ్యాపారులు వచ్చి పశువులు కొనుగోలు చేస్తుంటారన్న ఆరోపణలున్నాయి. ప్రధానంగా ఈ సంత నుంచి కబేళాలకు పశువులు తరలిస్తున్నారన్న అనుమానాలున్నాయి.

● కోటబొమ్మాళి మండలం నారాయణవలస- తిలారు సంత ప్రతీ గురువారం జరుగుతుంటుంది. ఇక్కడ సైతం భారీ స్థాయిలో పశువుల క్రయవిక్రయాలు జరుగుతాయి. ఇక్కడి నుంచి కూడా పశువులను కబేళాలకు తరలిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఇక్కడ కొనుగోలు చేసిన పశువులను వ్యాన్లలో ఇతర ప్రాంతాలకు తరలిస్తారు. అక్కడ నుంచి కంటైనర్లలో రాత్రిపూట రవాణా చేస్తారని తెలుస్తోంది.

రణస్థలం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పశువుల అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. దళారుల ద్వారా సంతల్లో కొనుగోలు చేసిన పశువులను వ్యాన్‌లు, కంటైనర్లలో కబేళాలకు అక్రమంగా తరలిస్తున్నారు. జిల్లాలోని చాలా ప్రాంతాల్లో పశువుల కొనుగోలుకు కొంతమంది దళారులను ఏర్పాటు చేసుకున్నారు. కొనుగోలుదారుల విషయం బయటపడకుండా వారు రైతుల రూపంలో గ్రామాల్లోకి వస్తారు. పశువులను కొనుగోలు చేస్తారు. వాటిని జాతీయ రహదారి సమీపంలో ఖాళీ ప్రదేశాల్లో ఒకదగ్గరకు చేర్చుతారు. రాత్రిపూట లారీలు, ఇతర వాహనాల్లో కుక్కి తరలిస్తుంటారు. మరికొందరు కంటైనర్లతో రహస్యంగా కబేళాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రస్తుతం వ్యవసాయంలో యాంత్రీకరణ రావడంతో రైతులకు పశువుల వినియోగం తగ్గింది. పాడి పశువుల పెంపకం మాత్రం పెరుగుతోంది. కాగా వయసు అయిపోయిన పశువులను తక్కువ ధరకు విక్రయించాల్సిన పరిస్థితి వస్తోంది. అటువంటి పశువులనే సంతల్లో దళారులు కొనుగోలు చేసి కబేళాలకు తరలిస్తున్నారనే ఆరోపణలున్నాయి.



● కానరాని నిబంధనలు

పశువుల తరలింపు, రవాణాకు అనుమతిపత్రాలు తప్పనిసరి. సుదూర ప్రాంతాలకు వ్యవసాయ పనుల నిమిత్తం, పాడి అవసరాలకు తరలిస్తున్నామని ధ్రువీకరిస్తూ ప్రభుత్వ అధికారులు, సిబ్బంది నుంచి (మిగతా 8వ పేజీలో..)



చెల్లాచెదురుగా పడేసిన వస్తువులు

వివేకానంద కాలనీలో భారీ చోరీ

● రూ.14 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు అపహరణ

8 లో

బాలికపై వృద్ధుడి వికృత చేష్టలు



● చాక్లెట్ ఆశ చూపి అసభ్య ప్రవర్తన
● పోలీసులను ఆశ్రయించిన తల్లిదండ్రులు

8 లో

బెట్టింగుల్లో నష్టపోయి.. దొంగగా మారి!

● ఆన్‌లైన్‌లో ఆడి డబ్బులు పోగొట్టుకున్న యువకుడు
● మళ్లీ ఆడేందుకు చైన్‌స్నాచర్‌గా మారిన వైనం
● నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

పలాస, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఆ యువకుడు ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడాడు. రూ.1.10 లక్షల వరకూ పోగొట్టుకున్నాడు. మళ్లీ ఆ సొమ్మును రాబట్టుకునేందుకు చైన్‌స్నాచర్‌గా మారాడు. దొంగిలించిన బంగారాన్ని అమ్మేసి.. ఆ డబ్బులతో మళ్లీ ఆన్‌లైన్ బెట్టింగ్‌లు ఆడుతున్నాడు. చివరకు పోలీసులకు దొరికిపోయాడు. సోమవారం కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ వి.వెంకట అప్పారావు ఈ వివరాలు వెల్లడించారు. ఇచ్ఛాపురం మునిసిపాలిటీ పురుషోత్తపురానికి చెందిన బంగారు బండి ప్రదీప్ అనే 19 ఏళ్ల యువకుడు విశాఖపట్నంలోని ఐటీఐలో చేరి సగంలోనే చదువుకు స్వస్తి పలికాడు. ఇంటివద్దే ఖాళీగా ఉంటూ ఫోన్‌లో ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతూ, బెట్టింగులకు పాల్పడేవాడు. ఈ క్రమంలో రూ.1.10 లక్షల వరకు పోగొట్టుకున్నాడు. ఇంట్లో ఆ విషయం తెలియకుండా దొంగతనం చేసి ఆ డబ్బులు రాబట్టుకునేందుకు పథకం రచించాడు. ఈ నెల 12న కోసంగిపురానికి చెందిన దుంపల యశోద అనే వృద్ధురాలికి రహదారిపై లిఫ్ట్ ఇస్తానని చెప్పి.. నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లాడు. ఆమె మెడలో బంగారు ఆభరణాలు లాక్కుని ఉడాయించాడు. ఈ బంగారాన్ని పలాస రైల్వే కాలనీలో నివాసం ఉంటున్న రుసువా కిరణ్‌కుమార్‌కు ఇవ్వగా.. దాన్ని కాశీబుగ్గ రెల్లివీధికి చెందిన పవర్ రంజిత్‌కు అమ్మకానికి ఇచ్చారు. రూ.1.77 లక్షలకు వాటిని అమ్మారు. ఇందులో కిరణ్‌కుమార్‌కు రూ.27వేలు ఇవ్వగా, మిగిలిన రూ.1.50లక్షలు ప్రదీప్ తీసుకున్నాడు. ప్రదీప్ తన వాటాకు వచ్చిన నగదు కూడా ఆన్‌లైన్ బెట్టింగులో పోగొట్టుకున్నాడు. దీంతో పలాసలో బాబాయి వరసైన కిరణ్‌కుమార్ వద్దకు వెళ్లి రూ.10వేలు కావాలని అడిగాడు. బాధిత మహిళ తన ఆభరణాలు పోయాయంటూ ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు గాలిస్తుండగా ప్రదీప్ పలాసలో తారసపడ్డాడు. అనుమానంతో అతడ్ని అదుపులోకి తీసుకుని ప్రశ్నించడంతో చైన్‌స్నాచింగ్ విషయాన్ని వెల్లడించాడు. నిందితుడిని అరెస్టు చేసి, పలాస కోర్టులో హాజరుపరిచామని డీఎస్పీ తెలిపారు. కేసు ఛేదనలో ప్రతిభ చూపిన సీఐ పి.సూర్యనారాయణ, సిబ్బందిని ఆయన అభినందించారు.



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకట అప్పారావు

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమదాల నివారణే లక్ష్యంగా.. భద్రతా చర్యల ఆంక్షలను మరింత కఠినతరం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో రహదారుల భద్రతా సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. శాఖలవారీగా ప్రమాదాలను విశ్లేషించి, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. 'జిల్లాలో కొద్దిరోజులుగా జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదాల్లో ప్రజలు ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరం. ప్రధాన రహదారుల్లో డివైడర్లను బ్రేక్ చేసి వాహన ప్రమాదాలకు కారణమవుతున్న వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేయాలి. 108 సేవలు సకాలంలో అందేలా వైద్యారోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి. అతివేగం, డ్రైవింగ్ లైసెన్సు, హెల్మెట్ లేకుండా ప్రయాణం, పరిమితికి మించి ప్రయాణికులను ఆటోల్లో ఎక్కించిన వారిపై కఠినచర్యలు తీసుకోవాల'ని కలెక్టర్ ఆదేశించారు.

● ఎస్పీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ 'రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జాతీయ రహదారిపై బ్లాక్‌స్పాట్‌లో జరుగుతున్నాయి. హైవే అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు. శ్రీకాకుళంలో ఆర్టీసీ బస్సు ఢీకొని గర్భిణి చనిపోతే, సంబంధిత యూనియన్‌లో కొందరు మానవతా విలువలు మరిచి వ్యవహరించిన తీరు బాధాకరం. హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులకు త్వరగా పరిహారం అందేలా చర్యలు తీసుకోవాల'ని తెలిపారు.

చిత్తశుద్ధితో పనిచేయాలి

జిల్లాలో మత్తు పదార్థాల వినియోగం, విక్రయాలు, రవాణాను అరికట్టేందుకు చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాస్థాయి నార్కోటిక్స్ కంట్రోల్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల మూల సరఫరా రవాణాను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. జిల్లాలో మత్తు పదార్థాల నివారణకు తీసుకుంటున్న చర్యలను ఎస్పీ మహేశ్వరరెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో డీఎస్పీలు వివేకానంద, మూర్తి, వెంకటప్పారావు, డీపీవో భారతీ సౌజన్య, ఆర్అండ్‌బీ ఎస్ఈ జాన్ సుధాకర్, నేషనల్ హైవే అథారిటీ పీడీ తివారీ, జిల్లా ఫైర్ అధికారి జె.మోహనరావు, ఎంవీఐ గంగాధర్, ట్రాఫిక్, పోలీసు, రవాణాశాఖ అధికారులు, ఎన్జీవో సంస్థల ప్రతినిధులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


శ్రీకాకుళంలోని ప్రభుత్వ హైస్కూల్ వద్ద వేచి ఉన్న విద్యార్థులు

గందరగోళం..

టెక్కలి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్‌సీఎం పాఠశాల కేంద్రంలో పరీక్ష రాసేందుకు హాజరైన విద్యార్థులు గందరగోళానికి గురయ్యారు. విద్యార్థులకు కేటాయించిన రూమ్ నెంబర్లు, హాల్‌టిక్కెట్ నెంబర్లు నోటీసు బోర్డులో పెట్టక పోవడంతో విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. తల్లిదండ్రులు సైతం రూమ్ నెంబర్లు, హాల్‌టిక్కెట్ నెంబర్ల కోసం ఆరా తీస్తూ ఆందోళనగా అటూ ఇటూ తిరగాల్సి వచ్చింది.


టెక్కలిలో పరీక్షలు రాసేందుకు సిద్ధంగా...

ఉత్సాహంగా..



జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. కొన్ని పరీక్ష కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. మరికొన్ని చోట్ల అసలు ఎవరికి ఏ గది కేటాయించారో తెలిపే బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదని విద్యార్థులు వాపోయారు. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు అంతంతమాత్రంగానే ఉండడంతో ఆటోల్లో కిక్కిరిసి..గమ్యస్థానాలకు చేరుకోవలసి వచ్చింది.

– ఆంధ్రజ్యోతి బృందం

- పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం
- తొలి రోజు ప్రశాంతం
- కేంద్రాల్లో సౌకర్యాలు కరువు
- విద్యార్థులకు అవస్థలు


శ్రీకాకుళంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద..


హిరమండలం: స్క్రైబ్ సాయంతో పరీక్షకు హాజరైన దివ్యాంగ విద్యార్థిని


మెళియాపుట్టి: చాపరలో..


హిరమండలం: పరీక్షకు వెళ్లే ముందు సరస్వతీదేవికి ప్రార్థిస్తున్న కేజీబీవీ విద్యార్థినులు


పొందూరు: దివ్యాంగ విద్యార్థిని మోసుకుని వెళ్తున్న దృశ్యం

ఉక్కపోతతో ఇక్కట్లు

పొందూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మం డల కేంద్రం పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తాడివ లస, కింతలి జెడ్పీ ఉన్నత పాఠశాలలు, మోడల్ పాఠశాలలో పదో తరగతి పరీక్ష కేంద్రాలు కేటాయించారు. పొందూరు ఉన్నత పాఠశాలలో 294 మంది, మోడల్ పాఠశాలలో 286, కింతలిలో 166, తాడివలసలో 58 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.

ఫ్యాన్లు లేక అవస్థలు

పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల రూమ్-10లో ఫ్యాన్లు లేకపోవడంతో విద్యార్థులు 3 గంటల పాటు ఉక్కపోతతో ఇబ్బంది పడ్డారు. ఎండవేడి.. ఉక్కపోతతో పరీక్ష రాయడానికి చాలా ఇబ్బంది పడినట్లు విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేశారు. మిగిలిన గదుల్లోనూ కేవలం ఒకటి లేదా రెండు ఫ్యాన్లు మాత్రమే ఉండడంతో విద్యార్థులు ఉక్కపోతకు గురయ్యారు. దీంతో హెచ్‌ఎం వెంకటరావుపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై చైల్డ్‌రైట్స్ కమిషన్ సభ్యులు గొండు సీతారాం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో సమస్యను పరిష్కరిస్తామని జిల్లా విద్యా శాఖాధికారి తిరుమల చైతన్య తెలిపారు.

దివ్యాంగుడి కోసం...

దివ్యాంగుడైన మనవడితో పదో తరగతి పరీక్షలు రాయించేందుకు ఓ తాత పడిన ఆరాటం చూసి పలువురి గుండె బరువెక్కింది. దళ్లవలస గ్రామానికి చెందిన దివ్యాంగుడు కిల్లాన దామోదరరావు తోలాపి హైస్కూల్‌లో చదువుతున్నాడు. కనీసం ఇద్దరు తోడు లేనిదే బయటకు రాలేని పరిస్థితుల్లో సోమవారం కింతలి పరీక్ష కేంద్రానికి ఆటోలో తాతతో పాటు తోలాపి ఉపాధ్యాయుడు వేణుగోపాల్‌తో వచ్చారు. దామోదరరావును భుజాలపై మోసుకుని పరీక్ష హాలులోకి తీసుకువెళ్లి.. గోడకు దగ్గరగా కుర్చోబెట్టారు. దామోదర రావు స్క్రైబ్ సాయంతో పరీక్ష రాశాడు. కనీసం కూర్చోవడానికి ఇబ్బందులు పడుతున్న దివ్యాంగ విద్యార్థి పరీక్ష రాసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని పలువురు కోరుతున్నారు.


ఫ్యాన్లు లేని పొందూరు హైస్కూల్‌లోని పరీక్ష గది


హరిపురం: గిరిజన విద్యార్థుల సౌకర్యార్థం బుడంబో పరీక్ష కేంద్రం వద్ద అధికారులు ఏర్పాటు చేసిన బస్సు


సరుబుజ్జిలి: పరీక్ష కేంద్రంలోనికి వెళుతూ..


జి.సిగడాం: పరీక్షలు రాసేందుకు వెళుతున్న విద్యార్థినులు


ఇచ్ఛాపురం: నోటీసు బోర్డులో హాల్ టికెట్ నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు


శ్రీకాకుళం: పరీక్ష రాసేందుకు సిద్ధంగా ఉన్న విద్యార్థులు


నందిగాం: క్యూలైన్‌లో పరీక్షకు వెళుతున్న గురుకుల విద్యార్థినులు


ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

మదీనా దర్గాలో వైభవంగా చందనోత్సవం

గార, మార్చి 17(ఆంధ్రజ్యోతి): హిందూ.. ముస్లింల ఐక్యతకు ప్రతీకగా నిలిచే కళింగపట్నంలోని మదీనా దర్గాలో సోమవారం చందనోత్సవాన్ని (ఉర్సు) వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే బాబా సమాధిపై చందన లేపనం పూసి... కొత్త వస్త్రాన్ని అలంకరించారు. ఆ తరువాత భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం బాబా అంగరఖా (కొత్త వస్త్రం)ను దర్గా ఎదురుగా ఉన్న మసీదు వద్ద నుంచి దర్గా వద్దకు తీసుకు వచ్చి సమాధిపై కప్పారు. తర్వాత ఖురాన్ పఠనం, ఖవాలీ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్గా ట్రస్టు సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


దర్గా ప్రాంగణంలో ముస్లింలు

‘ఈగల్’ టీమ్ వస్తోంది

(ఐదో పేజీ తరువాయి)

స్థానంలో శ్రీకాకుళం జిల్లా నిలిచింది. సైబర్ కేసుల్లో పురోగతి చూపిస్తున్నాం.

ప్రశ్న: హైవేపై రోడ్డు ప్రమాదాల నివారణ ఎలా?

జవాబు : రాష్ట్రంలోనే అత్యధిక హైవేతోపాటు తీరప్రాంతం కూడా జిల్లాలో ఉంది. పోలీసు వాహనాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఇకపై ద్విచక్ర వాహనాలతో పెట్రోలింగ్ చేపట్టేలా పోలీసులకు ఆదేశించాం. ఇందుకుగాను కొత్త ద్విచక్ర వాహనాలు వస్తున్నాయి. ప్రమాద ఘటనా స్థలానికి ఎంతసేపట్లో పోలీసులు చేరుకున్నారన్నదీ జీపీఎస్ ద్వారా ట్రాక్ చేస్తాం. ప్రమాదాలు సంభవించకుండా వాహనదారులకు కొత్త మోటారు వాహనచట్టం నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న: సోషల్‌మీడియా వేదికగా అరాచకాన్ని ఎలా నియంత్రిస్తారు?

జవాబు: ఇకపై సోషల్‌మీడియాను అడ్డుపెట్టుకుని విర్రవీగిపోతామంటే కుదరదు. హద్దులు దాటి విమర్శలు, ఆరోపణలు, మార్ఫింగ్, ఫేక్ పోస్టులు పెడితే తక్షణ చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 31 కేసులు నమోదు చేశాం. ఇందులో 17 మందికి నోటీసులు ఇచ్చాం. ఐదుగురిని అరెస్ట్ చేశాం. ఆరు కేసుల్లో చార్జిషీటు కూడా దాఖలు చేశాం. కళాశాలల్లో, స్కూళ్ల వద్ద డ్రాప్‌బాక్స్‌లను ఏర్పాటుచేసి దానిపై సీఐ, ఎస్‌ఐల ఫోన్ నంబర్లను తెలియజేస్తాం. సమస్యను కాగితంపై రాసి డ్రాప్‌బాక్స్‌లో వేస్తే.. వాటిని పోలీసులు తీసుకుని వెంటనే చర్యలు చేపడతారు. సోషల్‌మీడియాకు హద్దులున్నాయన్నది అందరూ గ్రహించాల్సిందే. మహిళలను, అమ్మాయిలను వేధిస్తామంటే కఠిన చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: పోలీసుల సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలు?

జవాబు: పోలీసుల భద్రత, సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటు న్నాం. అనారోగ్య సమస్యలున్నవారిని.. కొంత వయసురీత్యా ఇబ్బందులతో ఉన్నవారిని గుర్తించి వారికి ఒత్తిడి లేని విధంగా విధులను కేటాయిస్తున్నాం. ఏటా పోలీసులు, హోంగార్డులకు అన్ని రకాల వైద్యపరీక్షలు ని ర్వహించేందుకుగాను రెండు ఆసుపత్రిలతో హెల్త్ కార్డులను అందజేయించాం. గ్రూపు ఇన్సూరెన్స్.. ఇతరత్రా ప్రయోజనాలు వర్తించేలా.. వైద్యపరంగా చర్యలు తీసుకున్నాం. వైద్యపరీక్షలు చేయిస్తున్నాం.

ప్రశ్న: ఎల్.ఎన్.పేటలో పోలీసుస్టేషన్ ఏర్పాటు చేస్తారా?

జవాబు: ఎల్.ఎన్.పేట మండలంలో పోలీసుస్టేషన్‌ను ఏర్పాటు చేయాలని .. అక్కడ అవసరమైన సిబ్బంది వివరాలతో ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించాం. స్టేషన్‌ను నిర్వహించేందుకు భవనం కూడా సిద్ధంగా ఉంది.

ప్రశ్న: వినతుల పరిష్కారానికి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: అధిక వినతులు భూ వివాదాలకు చెందినవే. మరి కొన్ని వినతులు అన్యాయానికి గురైనవారి నుంచి వస్తున్నాయి. ప్రతీ వినతిని పరిశీలిస్తున్నా. అర్జీదారుల నంబర్ తీసుకుని.. కొద్దిరోజు ల తర్వాత సమస్య పరిష్కార స్థితి.. వారి సంతృప్తి స్థాయిని కూ డా నేనే స్వయంగా తెలుసుకుంటున్నా. చట్టపరిధిలో సమస్యను పరిష్కరించని వాటిపై వెంటనే సిబ్బందితో మాట్లాడి చర్యలు తీసుకుంటున్నాను. సివిల్ వ్యవహారాల్లో వినతులను పరిష్కరిం చేందుకు ఇకపై రెవెన్యూ అధికారులు కూడా బృందంగా ఉండేలా కలెక్టర్‌ను కోరాం. త్వరలో బృందం ఏర్పాటవుతుంది. బాధితులకు మరింత న్యాయం జరుగుతుంది.

ప్రశ్న: నేర నియంత్రణ, చెక్‌పోస్టుల వద్ద నిఘా ఎలా ఉంది?

జవాబు: అన్ని స్టేషన్ల పరిధిలో విజుబుల్ పోలీసింగ్‌ను అమలు చేస్తున్నాం. గంజాయితో పట్టుబడిన వారిపై రౌడీషీట్స్ తెరుస్తున్నాం. వారి ఆస్తులను కూడా జప్తు చేస్తున్నాం. రౌడీషీటర్లపై నిఘా కొనసాగుతుంటుంది. అలాగే భద్రతకు సంబంధించిన అంశాల్లో.. కొన్ని విభాగాల్లో పోలీసు సిబ్బందిని మార్పు చేశాం. ఆకస్మికంగా పోలీసుల పనితీరును.. స్టేషన్లను స్వయంగా తనిఖీ చేస్తున్నాను. యువత చెడిపోకుండా తరచూ అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. కొన్ని సందర్భాల్లో యువకులు, విద్యార్థులు పట్టుబడితే వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇస్తున్నాం. ప్రస్తుతం మూడు డ్రోన్ల సహాయంతో నిఘా కొనసాగుతోంది. త్వరలో ప్రతీస్టేషన్‌కు ఒక డ్రోన్ కూడా సమకూర్చి మరింత నిఘా వ్య వస్థను పటిష్ఠం చేస్తాం. ఇసుక, గంజా యి, అక్రమ మద్యం వంటివాటిపై ఇదివరకు ఉన్న చెక్‌పోస్టులతో పాటు.. కొత్తగా మెళియాపుట్టి మండలం గొప్పిలి వద్ద చెక్‌పోస్టు ను ఏర్పాటు చేస్తున్నాం. దత్తత గ్రామాల్లో కానిస్టేబుళ్లు వెళ్లి పర్యటించాల్సిందే.

ప్రశ్న: మహిళల భద్రతకు తీసుకున్న చర్యలు?

జవాబు: ఇటీవలే ‘శక్తి’ యాప్‌ను ప్రభుత్వం తీసుకువచ్చింది. మహిళల భద్రతే ప్రధానాంశంగా.. క్షణాల వ్యవధిలో ఆపదలో ఉన్నవారి వద్దకు పోలీసులు చేరుకునేలా ఇది పనిచేస్తుంది. ప్రజలకు శక్తి యాప్ గురించి అవగాహన కల్పిస్తున్నాం. జిల్లాలో ఆరుగురు మహిళా ఎస్‌ఐలు కూడా ఈ యాప్‌ను పర్యవేక్షించడంతోపాటుగా.. సంఘటనా స్థలానికి చేరుకుంటారు. అలానే పోలీసు స్టేషన్లలో మహిళల నుంచి ఫిర్యాదును స్వీకరించేందుకు కూడా ఉమెన్ హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేస్తున్నాం. చిన్నారులపై అకృత్యాలు.. ఈవ్‌టీజింగ్ వంటి వాటిపై సమాచారం అందగానే.. శక్తి టీమ్ వెళ్లి బాధితులను రక్షిస్తుంది. త్వరలో ప్రతీ ఆటోకు క్యూఆర్ కోడ్ పెడతాం. ఆ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగానే.. అందులో ప్రయాణిస్తున్న వారికి వివరాలు తెలుస్తాయి. మహిళలు.. ఇతరులు ఆపదలో ఉంటే.. వారు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి సమాచారం తెలియజేస్తే వెంటనే పోలీసులు స్పందిస్తారు. ప్రయాణికుల భద్రతతో పాటు.. ఆటోలపై పూర్తిస్థాయిలో నిఘా ఉంటుంది.

ప్రశ్న: ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాల అమరిక పూర్తయిందా?

జవాబు : జిల్లా అంతటా వాస్తవంగా ప్రతి కదలికను పసిగట్టేందుకు 14వేల సీసీ కెమెరాలు అవసరం. అయితే అందులో ప్రాధాన్యం గురించి.. ఇప్పటికే పలుచోట్ల కెమెరాలు ఏర్పాటు చేశాం. ఈ నెలాఖరు నాటికి 3వేల కెమెరాలు ఏర్పాటు చేసి.. నేరాలు సంభవిస్తే వెంటనే స్పందించేలా యంత్రాంగాన్ని సిద్ధం చేశాం.

ప్రశ్న: కొన్ని సందర్భాల్లో పోలీసులపై వస్తున్న ఆరోపణలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

జవాబు : బాధితులకు న్యాయం కోసం తక్షణమే డయల్ 112ను వినియోగించుకోవచ్చు. శక్తి యాప్‌ను ఉపయోగించుకోవచ్చు. నేరుగా నాకు మెసేజ్ చేయవచ్చు. వాట్సాప్ కాల్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చు. సమాచారం ఇవ్వవచ్చు. పోలీసులపై వచ్చే ఆరోపణలు నిజమైతే చర్యలు కచ్చితంగా ఉంటాయి. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని పోలీసులకు ఆదేశించాం. ప్రజల సంరక్షణ కోసమే పోలీసు వ్యవస్థ ఉంది.

పీఏసీఎస్‌ల్లో అక్రమాలపై స్పందించండి

● ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్



మాట్లాడుతున్న రవికుమార్

ఆమదాలవలస, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డీసీసీబీ, పీఏసీఎస్‌ల్లో అక్రమాలపై సంబంధిత అధికారులు స్పందించాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ కోరారు. సోమవారం శాసనసభలో ఆయన మాట్లాడుతూ శాసనసభ్యులు అసెంబ్లీలో ప్రస్తావించిన పలు సమస్యలపై సంబంధిత అధికారులు, రాష్ట్ర సచివాలయ ఉద్యోగులు సకాలంలో వివరాలు అందించడం లేదని తెలిపారు. తమకు అందించిన పత్రాల్లో పూర్తిస్థాయి సమాచారం లేదని, బూర్జ పీఏసీఎస్ పరిధిలో సుమారు 12 కోట్ల రూపాయలు రైతుల డబ్బులు సీఈవో అక్రమాలకు పాల్పడ్డారని, ఆయన మరణించారని తెలిపారు. ప్రస్తుతం సంబంధితశాఖ నుంచి ఎటువంటి రుణాలు అందని రైతులకు అధికమొత్తంలో రుణాలు అందాయని, చెల్లింపులు చేయాలని నోటీసులిస్తున్నారని రవికుమార్ అసెంబ్లీలో పేర్కొన్నారు. డిప్యూటీ స్పీకర్ రఘురామకష్ణంరాజు కలుగజేసుకొని అసెంబ్లీలో ఎమ్మెల్యేలు ప్రశ్నించిన సమస్యలపై సంబంధితశాఖ రాష్ట్ర సచివాలయ ఉద్యోగులు పూర్తిస్థాయి సమాచార ఇవ్వాల్సి ఉందని తెలిపారు. భవిష్యత్‌లో ఇటువంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఫిర్యాదులను పరిష్కరించాలి: ఎస్పీ

అరసవల్లి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఫిర్యాదులకు పరిష్కారాన్ని చూపించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశించారు. సోమవారం శ్రీకాకుళంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల నమోదు, పరిష్కార కార్యక్రమంలో 63 ఫిర్యాదులు స్వీకరించారు.ఈసందర్భంగా బాధితులతో ముఖాముఖి మాట్లాడారు.వారి అర్జీలను పూర్తిగా పరిశీలించి, సంబంధిత అధికారులకు జూమ్ కాన్ఫరెన్స్‌లో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

బీఈడీ మూడో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

ఎచ్చెర్ల, మార్చి 17(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అనుబంధ 14 బీఈడీ కళాశాలల విద్యార్థులకు సంబంధించి మూడో సెమిస్టర్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈమేరకు బీఆర్‌ఏయూతోపాటు శ్రీకాకుళం ప్రభుత్వమహిళా డిగ్రీ, టెక్కలి,పాలకొండ, పలాసలోని ప్రభుత్వ డిగ్రీ, రాజాంలోని జీసీఎస్ఆర్ కళాశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేశారు. తొలిరోజు మేథ్స్, బయలాజికల్ సైన్స్ మెథడాలజీ సబ్జెక్ట్‌లకు పరీక్ష జరిగింది. ఈ నెల 21వ తేదీ వరకు జరిగే ఈపరీక్షలకు 1,200 మంది విద్యార్థులు హాజరవుతున్నారు.పరీక్షలను వర్సిటీ కళాశాల ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.అనూరాధ పరిశీలించారు.

ఆ గ్రామాలను పంచాయతీలుగానే గుర్తించండి

ఎచ్చెర్ల, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని తోటపాలెం, కుశాలపురం గ్రామాలను పంచాయతీలుగానే గుర్తించాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు కోరారు. ఈ పంచాయతీలను శ్రీకాకుళం మునిసిపల్ కార్పొరేషన్‌లో విలీనంచేసిన విషయం విదితమే.వీటిని తిరిగి పంచాయతీలుగా గురించాలని ప్రభుత్వానికి ఎమ్మెల్యే లేఖరాశారు.స్పందించిన పంచాయతీరాజ్, గ్రామీణాభి వృద్ధిశాఖ సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్‌ను కోరింది.

ఎన్‌పీఎస్‌ను రద్దు చేయాలి

ఆమదాలవలస, మార్చి 17(ఆంధ్రజ్యోతి):నేషనల్ పెన్షన్ స్కీం (ఎన్‌పీఎస్)ను రద్దుచేయాలని ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ శ్రీకాకుళం రోడ్డు నౌపడా బ్రాంచి ఇన్‌చార్జి మెట్ట అనీల్‌చంద్ర కోరారు. సోమవారం శ్రీకాకుళం రోడ్డు రైల్వే స్టేషన్ ఏడీఈఎన్ కార్యాలయం ఎదుట ఎస్.దంతేశ్వరరావు, బి.ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఈనెల 21 వరకు ధర్నా నిర్వహిస్తామని తెలిపారు.అనంతరం డివిజనల్ రైల్వే మేనేజర్‌కు వినతిపత్రం అందించారు.

227 బయోమెట్రిక్ స్కానర్ల మంజూరు

జి.సిగడాం, మార్చి 17(ఆంధ్రజ్యోతి):మండలానికి 227 బయోమెట్రిక్ స్కానర్లు మంజూరయ్యాయని ఎంపీడీవో గుంట ముక్కల రామకృష్ణ తెలిపారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి బయోమెట్రిక్ స్కానర్లను అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు సాహూ పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో అధిక దిగుబడి

ఆమదాలవలస, మార్చి 17(ఆంధ్రజ్యోతి):నవధాన్యాల సాగుతో అధిక దిగుబడి సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ డీపీఎం రేవతి తెలిపారు.పట్టణంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్లు, ప్రకృతి వ్యవసాయ విభాగం, వెలుగు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శ్రీనివాస్, లక్ష్మీనాయుడు, ఏవో మెట్ట మోహన్‌రావు, ఏపీఎం గురుబెల్లి నారాయణరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై ఖరీఫ్ ప్రణాళిక

బూర్జ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బూర్జలో ప్రకృతి వ్యవసాయ విభాగం ఖరీఫ్ యాక్షన్‌ప్లాన్‌పై ఎస్ఈఆర్‌పీ, అగ్రికల్చర్, ఏపీసీఎన్ఎఫ్ కన్వర్జెన్సీలతో సమావేశం సోమవారం నిర్వహించారు. ఏపీఎం బాబూరావు, ఏవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగినసమావేశంలో అప్పలపేట, పీఎల్‌దేవిపేట, కొరగాం, బూర్జ, పాలవలస, రామన్నపేట, అల్లెన గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ ప్రణాళికపై చర్చించారు.సమావేశంలో ఎస్ఎఫ్ఏ శివ, ఎంటి చినమ్మడు, యూనిట్ ఇన్‌చార్జి జనార్దనరావు, ఐసీఆర్పీలు,వీవోఏలు, వీఏఏలు, సీసీలు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించండి

కవిటి, మార్చి17(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీపథకం కిందపనులు కల్పించాలని కొత్తపాలెం మత్స్యకారులకు కోరారు. ఈమేరకు రామయ్యపుట్టుగలో విప్ అశోక్ భార్య నీలోత్పలకు సోమవారం విన్నవించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బి.రమేష్, బి.తిరుమలరావు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

అరసవల్లి, మార్చి17(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నియోజకవర్గంలోని గుడ్ల తారక రామారావుకు రూ.4లక్షలు, బనిశెట్టి సత్యారావుకు రూ.1,18,481లు, పోరా అప్పారావుకు రూ.46,666 సీఎం సహాయనిధి చెక్కులను నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు గొండు స్వాతిశంకర్ ఎమ్మెల్యే కార్యాలయంలో పంపిణీ చేశారు.కార్యక్రమంలో వెంకటరమణమూర్తి, రెడ్డి గిరిజాశంకర్ పాల్గొన్నారు.

'శక్తి యాప్' సేవలపై అవగాహన

అరసవల్లి, మార్చి17(ఆంధ్రజ్యోతి):శ్రీకాకుళంలోని ఉమెన్స్ డిగ్రీ కళాశాల, బలగ మునిసిపల్ హైస్కూల్, ఎచ్చెర్ల, టెక్కలి, కాశీబుగ్గ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో శక్తి బృందాలు సందర్శించి శక్తి యాప్ ఆవశ్యకతను, యాప్ ద్వారా అందించే సేవలను వివరించి, సోమవారం అవగాహన కల్పించాయి.మహిళలు, విద్యార్థినులకు తమఫోన్లలో శక్తి యాప్‌ను ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలో వివరించాయి. చిన్నారులపై జరిగే నేరాలు, సైబర్ మోసాలపై 100, 112, ఛైల్డ్‌లైన్ 1098, గృహహింస 181, మహిళ వేదింపులు 1091, సైబర్ టోల్‌ఫ్రీ నెంబరు 1930, సంప్రదించి సేవలు పొందవచ్చని తెలియజేశాయి. బృందంలోని ఎస్ఐలు మాట్లాడుతూ నెంబర్లకు ఫిర్యాదు చేస్తే పది నిమిషాల్లో పోలీసులు చేరుకుని సమస్యను పరిష్కరిస్తారని తెలిపారు.

శ్రీకాకుళంలో పాదాలమ్మతల్లి ఉత్సవాలు

శ్రీకాకుళం కల్చరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని బాకర్‌సాహెబ్ పేటలో గల దుర్గా మహాలక్ష్మి ఆలయంలో పాదాలమ్మ తల్లి గ్రామదేవత మహోత్సవం సోమవారం ప్రారంభమయ్యింది. ఈ సందర్భంగా 108 మంది మహిళలు పసుపు నీటి కలశాలతో ఊరేగించారు. మంగళవారం మహాలక్ష్మి అమ్మవారికి చల్లదన కార్యక్రమాలు జరుగుతాయని అర్చకులు తెన్నేటి సునీల్ కుమార్ తెలిపారు.

బోరవానిపేటలో బాబా ఆలయ వార్షికోత్సవం

గార, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బోరవానిపేటలో షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం సోమవారం నిర్వహించారు. బాబాకు హారతి, పూజలు చేశారు.

● సోంపేట, మార్చి17(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని సత్యనారాయణస్వామి ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకుని సోమవారం గాలిగోపురం, ధ్వజస్తంభం, యాగశాల ప్రతిష్ఠ నిర్వహించారు.ఈసందర్భంగా ప్రత్యేక పూజలతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

కృష్ణాపురంలో ఒకరిపై దాడి

రణస్థలం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) మండలంలోని కృష్ణాపురానికి చెందిన కోరాడ సత్యంపై అదే గ్రామానికి చెందిన నలుగురు దాడి చేసి గాయపరిచారు. జేఆర్‌పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి కథనం మేరకు.. సోమవారం తెల్లవారుజామున కోరాడ సత్యం ఆలయానికి వెళ్లి పూజలు చేసుకుని ఇంటికి వస్తున్నాడు. ఆ సమయంలో ఆలయం సమీపంలో గొర్లె కూర్మినాయుడుతోపాటు మరో ముగ్గురు సత్యం పై దాడి చేసి గాయపరిచారు. దీంతో సత్యం చాతిపై గాయాలుకావడంతో శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. సత్యం ఫిర్యాదు మేరకు కేసునమోదు చేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి 184 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా పాల్గొన్నారు.

సారా రహిత సమాజమే లక్ష్యం

సారా రహిత సమాజమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. శ్రీకాకుళం నవోదయం 2.0 ప్రచారరథాన్ని జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించడంతోపాటు సారారహిత సమాజం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సారా వల్ల కలిగే దుష్పరిణామాలను ప్రజలకు వివరించాలని కోరారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ సారా సమాచారం కోసం టోల్‌ఫ్రీ నెంబర్ 14402ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ రామచంద్రారావు, జిల్లా ఎక్సైజ్ అధికారి సీహెచ్ తిరుపతినాయుడు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే పి-4 లక్ష్యం

పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించడమే పి-4 సర్వేలక్ష్యమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. సోమవారం శ్రీకాకుళం మండలంలోని కొత్తపేట, బాదుర్లపేట సచివాలయాన్ని సందర్శించి, సర్వే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రజలతో మాట్లాడి, వారి సమస్యలను అడిగితెలుసుకున్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

హామీలు అమలు చేయండి

● శ్రీకాకుళంలోని జడ్పీ కార్యాలయం ఎదుట నిరసనల హోరు

ఎన్నికల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీలు వివిధ ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు డిమాండ్‌చేశాయి. సోమవారం శ్రీకాకుళంలోని జడ్పీ కార్యాలయం వద్ద ధర్నా సీపీఐ, ఏఐవైఎఫ్‌తో పాటు పలు ప్రజా సంఘాలు సమస్యలు పరిష్కరించాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుచేయాలని నిరసనలు హోరెత్తించాయి. అనంతరం జడ్పీ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

అరసవల్లి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన పేదలకు ఇళ్లస్థలాలను మంజూరుచేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ డిమాండ్‌చేశారు.శ్రీకాకుళంలోని జడ్పీకార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ అర్హులైన పేదలకు గ్రామాల్లో మూడు, పట్టణాల్లో రెండు సెంట్ల స్థలాలను ఇస్తామని హామీఇచ్చారని గుర్తుచేశారు. ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల రూపాయలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సంతోష్, కొన్న శ్రీనివాసరావు, సీపీఐ నాయకులు అరవింద్, క్రాంతి పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి అందజేయాలి

ఎన్నికల్లో ప్రకటించిన మేరకు యువతకు నిరుద్యోగభృతిని అందజేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు సంతోష్, కొన్నశ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శ్రీకాకుళంలోని జడ్పీ కార్యాలయం ఎదుట ఏఐవైఎఫ్ నాయకులు అరవింద్, వసంత్, మధు, రాజు, క్రాంతి, నిరుద్యోగ యువకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డీఎస్సీ నోటిఫికేషన్ ఇప్పటికీ విడుదల చేయలేదని ఆరోపించారు.



జడ్పీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 17(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల దీర్ఘకాలిక పెండింగ్ బకాయిలు చెల్లించాలని ఏపీ స్టేట్ ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.సోమసుందరరావు కోరారు. శ్రీకాకుళంలోని జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో జేపీసీ ఛైర్మన్ చౌదరి పురుషోత్తమ నాయుడు, సెక్రటరీ ప్రసాదరావులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి కె.వేంకటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి కంప్యూటర్ శిక్షణ

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల నుంచి ఇద్దరు లేదా ముగ్గురికి మంగళవారం నుంచి ఈ నెల 22వ తేదీ వరకు కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. సోమవారం శ్రీకాకుళంలోని జడ్పీ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్, ఎక్సెల్ షీట్స్, అడ్వాన్స్ టూల్స్‌పై నిర్వహించే శిక్షణకు ఉద్యోగుల జాబితాలు సిద్ధంచేసి అందజేయాలని ఆదేశించారు. జడ్పీ సమావేశ మందిరంలో మంగళ, బుధవారాల్లో 100మంది కలెక్టరేట్, జిల్లాకేంద్రంలోని ఆయా శాఖల సిబ్బందికి ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదుగంటల వరకు కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 20న టెక్కలి డివిజన్ కేంద్రంలో 40 మందికి, 21న పలాసలో 30 మందికి, మార్చి 22న శ్రీకాకుళం డివిజన్ కేంద్రంలో 30 మంది ఉద్యోగులకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా ఉద్యోగుల నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

చేనేత మహిళలు స్వయంశక్తితో ఎదగాలి

పొందూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): చేనేత మహిళలు స్వయం శక్తితో ఎదిగి ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ కుప్పిలి పద్మ ప్రశన్న కోరారు. సోమవారం పొందూరులో దేవాంగ సంక్షేమసంఘంలో నాబార్డు ఆధ్వర్యంలో మహిళాదినోత్సవం పురస్కరించుకుని జాతీయ అవార్డు పొందిన ఖాదీ వడుకు మహిళా కార్మికులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రచయిత వాండ్రంగి కొండలరావు పాల్గొన్నారు.

బాలికల కబడ్డీ విజేత శ్రీకాకుళం

● జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించిన ఐదుగురు క్రీడాకారులు



ట్రోఫీ అందుకుంటున్న బాలికలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలబాలికల కబడ్డీ పోటీల్లో శ్రీకాకుళం బాలికల జట్టు విజయం సాధించింది. కడప జిల్లా పులివెందులలో జరిగిన 34వ రాష్ట్రస్థాయి పోటీల్లో ఫైనల్‌లో శ్రీకాకుళం జట్టు అనంతపురం జట్టుపై తలపడింది. హోరాహోరీగా జరిగిన పోటీల్లో (37-36) ఒక్కపాయింట్ తేడాతో గెలిచి శ్రీకాకుళం జట్టు ట్రోఫీ కైవసం చేసుకుంది. ఈమేరకు టోర్నమెంట్‌లో నైపుణ్యం కనబరిచి బాలుర విభాగంలో పి.వెంకటేష్, ఎన్.గణేష్, బాలికల జట్టు నుంచి జె.చంద్రలేఖ, జె.కవిత, ఎ.మేఘన జాతీయస్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున పాల్గొనేందుకు అర్హత సాధించారు.ఎంపికైన క్రీడాకారులకు శ్రీకాకుళం కబడ్డీ సంఘం ఛైర్మన్, స్థానికఎమ్మెల్యే గొండు శంకర్, అధ్యక్షులు నక్క రామకృష్ణ, కార్యదర్శి సాధు ములసినాయుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శి సాధు శ్రీనివాసరావు, మెట్ట తిరుపతిరావు, నాగళ్ల రమేష్‌లు అభినందించారు. జట్టుకు కోచ్, మేనేజర్లుగా శిక్షకులు సింహాచలం, జాన్సీలు వ్యవహరించారు.

సుజలధార పథకాలకు మరమ్మతులు చేయండి

ఇచ్ఛాపురం,మార్చి17(ఆంధ్రజ్యోతి):కేశుపురం పంచాయతీపరిధిలో గల సన్యాసిపుట్టుగ, నీలాపుపుట్టుగల్లో గల ఎన్‌టీఆర్ సుజలధార పథకాలకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని టీడీపీ నాయకులు ఎల్.పద్మనాభం, దక్కత కామేష్ కోరారు. సోమవారం ఎంపీడీవో రామారావుకు వినతిపత్రం అందజేశారు.

పాఠశాలకు ల్యాప్‌టాప్ వితరణ

సోంపేట, మార్చి 17(ఆంధ్రజ్యోతి): బారువ బత్తులవీధి పాఠశాలకు ఎస్ఎంసీ సభ్యుడు హెచ్ఎం రట్టి అప్పారావుకు సోమవారం ల్యాప్‌టాప్ అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ ఛైర్మన్ నీలవేణి, రాజు పాల్గొన్నారు.

వసతులు లేకుండా ఎలా కేటాయిస్తారు..?

● పదో తరగతి పరీక్షల రాష్ట్ర పరిశీలకుడు మస్తానయ్య అసంతృప్తి

ఆమదాలవలస, మార్చి17 (ఆంధ్రజ్యోతి): ఆమదాలవలసలోని ఓ పాఠశాలకు చెందిన 46 మంది పదోతరగతి విద్యార్థులకు వసతులు లేకుండా గేటుమునిసిపల్ ఉన్నత పాఠశాలలో పరీక్షలు రాయడానికి ఎలా కేటాయిస్తారని పదో తరగతి పరీక్షల రాష్ట్ర పరిశీలకుడు మస్తానయ్య ప్రశ్నించారు. ఈ విషయంపై రెండు రోజులుగా పలు పత్రికల్లో కథనాలు రావడంతో ఆయన పరీక్ష కేంద్రాన్ని సోమవారం పరిశీలించి, అసంతృప్తి వ్యక్తంచేశారు. ఒకే పాఠశాలకు చెందిన మొత్తం విద్యార్థులకు ఒకే కేంద్రం ఎలా కేటాయిస్తారని పరీక్షల చీఫ్‌సూపరింటెండెంట్‌ను ప్రశ్నించారు. అనంతరం ఫ్లయింగ్ స్క్వాడ్ వాగ్దేవి పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. కాగా ఓ పాఠశాలకు చెందిన 46 మందికి ఒకే కేంద్రం కేటాయించడంపై రాష్ట్ర పరీక్షల విభాగానికి పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం మొబైళ్లలో ఫిర్యాదు చేశారు.

కార్యదర్శులపై పనిభారం తగ్గించాలి

సరుబుజ్జిలి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులపై పనిభారం తగ్గించాలని మండలపంచాయతీ కార్యదర్శుల సంఘ సభ్యులు కోరారు. సోమవారం ఎంపీడీవో ఎం.పావని, ఈవోపీఆర్డీ బొడ్డేపల్లి రామారావుకు వినతిపత్రం అందించారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం కలెక్టరేట్/ ఇచ్ఛాపురం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధికోసం సబ్సిడీతో కూడిన రుణాల కోసం ఈనెల 22 వరకూ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ గడ్డెమ్మ, ఇచ్ఛాపురం మునిసిపల్ కమిషనర్ ఎన్.రమేష్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. బీసీ, కాపు (తెలగ, బలిజ,ఒంటరి) కుమ్మరి/శాతవాహన,మేదర, ఈడబ్ల్యూఎస్(ఈబీసీ, కమ్మ, రెడ్డి,ఆర్యవైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ కులాలకు)చెందినవారు, దారిద్రరేఖకు దిగువన గలవారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. ఏపీఓబీఎంఎంఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వైబ్‌సైట్‌లో మీసేవా కేంద్రాల్లో గానీ, ఇంటర్‌నెట్ సెంటర్ లేదా సంబంధిత సచివాలయంలో గానీ నమోదు చేసుకోవాలని తెలిపారు.

అన్నిరంగాల్లో మహిళలు ముందుండాలి: ఎంపీడీవో

సోంపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలని ఎంపీడీవో ఈశ్వరమ్మ కోరారు.ఈ మేరకు సోమవారం మండలంలోని ఎర్రముక్కాంలో మహిళాదినోత్సవం పురస్కరించుకొని వివిధరంగాలకు చెందిన మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం అనంత, ప్రియాంక, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

మెనూపై విచారణ నిర్వహించాలి

శ్రీకాకుళం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సమగ్రశిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాలు, మోడల్ పాఠశాలల్లో నాసిరకమైన మెనూ పెడుతున్నారని రాడా రామారావు జడ్పీసమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన వినతుల విభాగంలో ఫిర్యాదుచేశాడు. మెనూ ప్రకారం సరుకులు సరఫరా కావడంలేదని, సమగ్ర విచారణ నిర్వహించాలని కోరాడు.



ఫిర్యాదులో పేర్కొన్న నాసిరకమైన మాంసం, కూరగాయలు ఇవే

ఆదిత్యాలయంలో ఘటనలపై విచారణ

అరసవల్లి,మార్చి 17(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ఆదిత్యాలయంలో జరుగుతున్న వరుస ఘటనలపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాల మేరకు ప్రత్యేక ఉపకలెక్టర్ లావణ్య సోమవారం రాత్రి ఈవో కార్యాలయంలో విచారణ నిర్వహించారు. అక్రమ బిల్లులు, గతంలో జరిగిన అక్రమ వసూళ్లు, కొద్ది రోజుల కిందట ఈవో కార్యాలయంలో జిల్లాకు చెందిన మాజీ స్పీకర్ మనువరాలికి కేశఖండన నిర్వహించిన సంఘటన, అధికారుల పర్యవేక్షణలోపాలు, తదితర విషయాలపై విచారణ నిర్వహించారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు నివేదించనున్నట్లు లావణ్య తెలిపారు. కార్యక్రమంలో ఈవో భద్రాజీ, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, జూనియర్ అసిస్టెంట్ కావ్య పాల్గొన్నారు.

రణస్థలంలో సీఐఎస్ఎఫ్ సైకిల్ ర్యాలీ బృందం

రణస్థలం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన సైకిల్ ర్యాలీ బృందానికి సోమవారం రణస్థలంలో తహసీల్దార్ ఎన్.ప్రసాద్ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. సీనియర్ కమాండెంట్ సతీష్‌కుమార్ బాజ్‌పే, డిప్యూటీ కమాండెంట్ వినీత్‌కుమార్ ప్రభాకర్ ఆధ్వర్యంలో 80 మంది సభ్యులకు రణస్థలంలో స్థానికులు కుంకుమ దిద్ది హారతులిచ్చారు. ఈ సందర్భంగా సతీష్‌కుమార్ బాజ్‌పే మాట్లాడుతూ పశ్చిమబెంగాల్‌కు చెందిన బృందాలు తొమ్మిది రాష్ట్రాల్లో 25 రోజుల పాటు పర్యటిస్తున్నాయని తెలిపారు. 100 మంది సభ్యులు 6553 కిలో మీటర్ల మేర చేపట్టిన ర్యాలీ మార్చి 31న కన్యాకుమారిలో ముగిస్తుందని తెలిపారు. మాదక ద్రవ్యాలరవాణా నిషేధం, అక్రమ ఆయుధాల నివారణ, తీవ్రవాదుల చొరబాటు నియంత్రణ, తీరప్రాంత భద్రత, మహిళా సాధికారత కోసం సీఐఎస్ఎఫ్ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో జేఆర్‌పురం సీఐ ఎం.అవతారం, ఎస్ఐ ఎస్.చిరంజీవి, ఏఎస్ఐ రమణమూర్తి, నాయకులు లంక శ్యామలరావు, డీజీఎం ఆనందరావు, పిసిని జగన్నాథం, పిన్నింటి వెంకటభానూజినాయుడు, కొమర లక్ష్మణరావు పాల్గొన్నారు.



సీఐఎస్ఎఫ్ బృందం నాయకుడికి సన్మానిస్తున్న అధికారులు

సేంద్రియ కూరగాయల సాగుపై అవగాహన

పొందూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి):మండలంలోని కృష్ణాపురం (గారపేట)లో సేంద్రీయ విధానంలో కూరగాయల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆముదాలవలస కేవీకేశాస్త్రవేత్త వి.కుమార్ రసాయనా లు, పురుగుల మందులు వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం చేస్తున్న మహిళారైతులను సన్మానించారు.కార్యక్రమంలో సర్పంచ్ అంబల్ల లక్ష్మి, అంబల్ల శ్రీను, ఉద్యానవనశాఖ అధికారి ఎం.అనూష, ఏఈవో బిందు, వై. భాస్కరరావు, సీఈవో నూక సన్యాసిరావు పాల్గొన్నారు.



క్రైం కార్నర్

వివేకానంద కాలనీలో భారీ చోరీ

● రూ.14 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు అపహరణ


క్లూస్ సేకరిస్తున్న దృశ్యం

పలాస, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక వివేకానంద కాలనీలో నివాసముంటున్న ఐటీసీ రిటైర్డ్ ఉద్యోగి మెట్ట సుదర్శనరావు ఇంటిలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సుదర్శనరావు రిటైర్ అయిన తరువాత నూతనంగా అభివృద్ధి చెందుతున్న వివేకానంద కాలనీలో ఇల్లు నిర్మించుకుని ఉంటున్నారు. దొంగలు చొరబడకుండా గట్టి బందోబస్తు చేసుకున్నారు. అయితే ఈనెల 8వ తేదీన భార్య భానుమతితో కలిసి కాశీయాత్రకు బయలుదేరారు. ఈ సమయంలో ఆభరణాలు, నగదును బీరువాలో భద్రపరిచారు. ఈ నేపథ్యంలో ఇంటి ముందు ఉన్న తలుపులు దొంగలు విరగ్గొట్టి ఇంటిలోకి ప్రవేశించారు. ఈ చోరీ రెండు రోజుల కిందట జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. సోమవారం కాశీ యాత్ర నుంచి వచ్చిన సుదర్శనరావు తాళాలు విరగ్గొట్టి ఉన్నట్లు గుర్తించారు. బెడ్‌రూంలో బీరువా తెరిచి వస్త్రాలను చిందరవందరగా వదిలేసి బంగారం, వెండి వస్తువులు అపహరించారు. ఈ చోరీలో రూ.14 లక్షల విలువైన 12 తులాల బంగారు ఆభరణాలు, 30 తులాల వెండి, రూ.లక్ష నగదు పోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదుచేశారు. క్లూస్‌టీమ్ ఘటనా స్థలానికి చేరుకొని దొంగతనం జరిగిన తీరు పరిశీలించి బీరువా, తలుపులపై దొంగల వేలిముద్రలను సేకరించారు. ఈ దొంగతనంలో ఇద్దరు, ముగ్గురు పాల్గొని ఉంటారని అంచనాకు వచ్చారు. ఈ మేరకు సుదర్శనావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పి.సూర్యనారాయణ తెలిపారు. మూడు రోజుల కిందట ఇదే రీతిలో దొంగతనం జరిగి విలువైన సామగ్రిని దోచుకున్న విష యం పాఠకులకు విదితమే. చోరీలు జరగకుండా గట్టి నిఘా ఏర్పాటు చేయాలని పలువురు పట్టణ వాసులు కోరుతున్నారు.

బాలికపై వృద్ధుడి వికృత చేష్టలు

● చాక్లెట్ ఆశ చూపి అసభ్య ప్రవర్తన
● పోలీసులను ఆశ్రయించిన తల్లిదండ్రులు

శ్రీకాకుళం క్రైమ్/గుజరాతీపేట: మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్ల బాలికపై ఓ వృద్ధుడు వికృత చేష్టలకు పాల్పడ్డాడు. కొద్దిరోజులుగా చిన్నారికి చాక్లెట్లు, బిస్కెట్లు ఆశచూపి బలాత్కారానికి ప్రయత్నించాడు. ఆ బాలిక వృద్ధుడి చేతిలో బలికాకుండా తల్లి చొరవతో క్షేమంగా బయటపడింది. న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించగా వృద్ధుడిపై రెండో పట్టణ పోలీసులు పోక్సో కేసు చేశారు. ఈ ఘటన శ్రీకాకుళంలో కలకలం రేపింది. టూటౌన్ సీఐ ఈశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో పని చేస్తూ ఓ వ్యక్తి కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు. ఆయన భార్య అపార్ట్‌మెంట్‌లో ఇంటి పనులు చేస్తోంది. వీరికి ఇద్దరు కుమార్తెలున్నారు. మరో అపార్ట్‌మెంట్‌లో హిందూస్థాన్ ఏరో నాటిక్స్‌లో లెక్చరర్‌గా పనిచేసి 2006లో రిటైరైన 80 ఏళ్ల కనిమెట్ట నర్సింహాచార్యులు నివసిస్తున్నాడు. ఆయన సదరు వ్యక్తి పెద్ద కుమార్తె (ఆరేళ్ల బాలిక)పై కన్నేశాడు. తరచూ చాక్లెట్లు, బిస్కెట్లు ఇస్తూ మచ్చిక చేసుకున్నాడు. శనివారం సాయంత్రం తన చెల్లితో ఆడుకుంటున్న బాలికకు చాక్లెట్లు ఆశ చూపి అపార్ట్‌మెంట్ కారు పార్కింగ్ ప్రాంతానికి తీసుకువెళ్లి వికృత చేష్టలకు పాల్పడ్డాడు. అదే సమయంలో అపార్ట్‌మెంట్‌లో పనులు ముగించుకుని అటుగా వచ్చిన బాలిక తల్లి నర్సింహాచార్యులు చేష్టలను గమనించింది. దీంతో అక్కడకు చేరుకున్న ఆమె ఆయనను మందలించింది. ఆయన నుంచి బాలికను విడిపించి ఇంటికి తీసుకు వెళ్లి జరిగిన ఘటనపై ఆరా తీసింది. భర్తకు జరిగిన ఘటనను భార్య తెలిపింది. ఈ మేరకు తల్లిదండ్రులు రెండో పట్టణ పోలీసులను సోమవారం ఆశ్రయించారు. ఈ ఫిర్యాదును టూటౌన్ సీఐ ఈశ్వరరావు స్వీకరించి శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద, ఎస్పీ మహేశ్వరరెడ్డికి తెలియజేశారు. ఎస్పీ ఆదేశాలతో బాధిత తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సంతోష్. నర్సింహాచార్యులపై పోక్సో కేసు నమోదు చేశారు. బాలికను విచారించారు. తల్లిదండ్రుల నుంచి వివరాలు సేకరించారు. ఈ ఘటనకు పాల్పడిన నర్సింహాచార్యులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

30 ఎకరాల్లో చీపురు పంట దగ్ధం


కొండపై కాలిపోతున్న చీపురుపంటను పరిశీలిస్తున్న జడ్పీటీసీ బుచ్చిబాబు

హిరమండలం, మార్చి17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడియాపాడు పంచాయతీ పరిధి కొండపైన అటవీప్రాంతంలో సోమవారం ఉదయం అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో గొడియపాడు, తాళ్లపాడు, పూలకొండ గిజన గ్రామాలకు చెందిన సుమారు 30 ఎకరా ల్లో చీపురు పంట కాలిపోయింది. పోడు పంటలపైనే ఆధారపడి జీవిస్తున్న సుమారు 20 మంది రైతుల చీపురు పంట మంటల్లో బూడిదవడంతో వారు లబోదిబో మంటున్నారు. మంటలు ఆర్పేందుకు ప్రయత్నించిన తాళ్లపాడు గ్రామానికి చెందిన బిడ్డిక సిమ్మయ్య ఎగిసపడిన మంటలకు తట్టుకోలేక అస్వస్థతకు గురయ్యాడు. విషయం తెలుసుకున్న జడ్పీటీసీ పి.బుచ్చిబాబు కొండపైన ఉన్న గ్రామాలను సందర్శించి కాలిన పంటలను పరిశీ లించారు. అస్వస్థతకు గురైన సిమ్మయ్యను పరామర్శించారు. ఈ సందర్భంగా స్థానికులు బిడ్డికి అప్పయ్య, యు.కృష్ణ, బి.భాస్కరరావు, బిడ్డికి రాజేష్ మాట్లాడుతూ.. ఆరు గాలం కష్టపడి పండించిన పంట కాలి బూడిదవడంతో తీవ్రంగా నష్టపోయామని, ప్రభుత్వం ఆదుకునేలా చూడాలని కోరారు. ప్రమాదానికి కారణాలు తెలియలేదన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

పలాస, మార్చి 17(ఆంధ్రజ్యోతి): రైల్వేశాఖలో రద్దు చేసిన పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని శ్రామిక్ కాంగ్రెస్ (గుర్తింపు కార్మిక సంఘం) ప్రతినిధులు డిమాండ్ చేశారు. సోమవారం రైల్వే స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు మాట్లా డుతూ.. రైల్వేశాఖలో కొత్త ఉద్యోగాల నియామకం చేపట్టాలని, పెండింగ్‌లో ఉన్న ట్రాక్ మెంటేనర్ల సమస్యలు పరిష్కరించాలని, రన్నింగ్ స్టాఫ్‌కు పన్నుల నుంచి 70 శాతం అలవెన్స్‌లు మినహాయించాలని, రైల్వేను కార్పొరేటీకరణ నుంచి ఉపసంహరించుకోవాలని, ఒప్పంద ఉద్యోగ నియమకాలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు రవి చౌదరి, విక్రమ్ రామారావు, కమ్మినేని హరి, ఆర్.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ నాయకులు

నిరుపయోగం

పలాస మండల కాంప్లెక్స్‌లో బోరు నిరుపయోగంగా ఉంది. వెలుగు, ఎంఆర్‌సీ భవనాలకు మధ్యలో గతంలో వేసిన బోరు తరువాత నిర్వహణ లేకపోవడంతో పనిచేయకుండా తయారైంది. మంచి ఉద్దేశంతో వేలాది రూపాయల వ్యయంతో వేసిన బోరు పనిచేయకపోవడంతో కార్యాలయాలకు వచ్చే ప్రజలు తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా బోరును బాగు చేసి వినియోగంలోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు.

- పలాసరూరల్ (ఆంధ్రజ్యోతి)


పని చేయని బోరు

ప్రమాదకరం


చవితి సీదికి వెళ్లే మార్గంలో శిథిలమైన వంతెన రెయిలింగ్

భగీరథపురం నుంచి చవితి సీదికి వెళ్లే మార్గంలో వంశధార కాలువపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరుకుంది. అలాగే కిట్టాలపాడు మార్గంలోని వంతెనదీ ఇదే తీరు.. సుమారు 25 ఏళ్ల కిందట నిర్మించిన వంతెనలు ఆ తరువాత ఎటువంటి నిర్వహణ లేకపోవడంతో రెయిలింగ్‌లు ఊడిపోయి, స్లాబ్ పెచ్చులూడి ప్రమాదకరంగా తయారైంది. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ వంతెనలపై ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని స్థానికులు కోరు తున్నారు.

-హిరమండలం (ఆంధ్రజ్యోతి)

నిర్లక్ష్యం


ఎంపీడీవో కార్యాలయ అదనపు భవనం పిల్లర్ల దుస్థితి ఇలా..

కొత్తూరు ఎంపీడీవో కార్యాలయ అదనపు భవనం ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. కొత్త భవనం నిర్మాణం చేపట్టి పాతభవనాన్ని వదిలేశారు. దీంతో వృథాగా ఉంది. మరమ్మతులు చేపట్టి వినియోగించే పరిస్థితి ఉన్నా ఆ దిశగా ఎటువంటి చర్యలు లేవు. ఈ భవనం స్తంభాలు, స్లాబ్ పెచ్చులూడి ప్రమాదాలను ఆహ్వానిస్తోంది. ఈ భవనంలో కోర్టు ప్లీడర్లకు బార్ అసోసియేషన్ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా భవనం మరమ్మతులు చేపట్టి పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. దీనంపై ఎంపీడీవో నీరజను వివరణ కోరగా అదనపు భవనం శిథిలావస్థలో ఉందని తన దృష్టికి వచ్చిందని, మరమ్మతులకు చర్యలు తీసుకుంటామన్నారు.

-కొత్తూరు (ఆంధ్రజ్యోతి)

పార్కింగ్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు

● రోడ్డు మార్జిన్ వరకు కాంక్రీట్ తొలగింపు


రోడ్డు మార్జిన్‌పై వేసిన కాంక్రీట్‌ను తొలగిస్తున్న దృశ్యం

నరసన్నపేట, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పాతబస్టాండ్ నుంచి సత్యవరం జంక్షన్ వరకు రోడ్డు మార్జిన్‌పై ఉన్న ఆక్రమణలను సోమవారం అధికారులు తొలగించారు. దుకాణాలకు సంబంధించి మార్జిన్‌ను ఆక్రమించి కాంక్రీట్ వేసి వాహనాల పార్కింగ్‌ను అడ్డుకుంటుండడంతో పంచాయతీ అధికారులకు పలువురు స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పంచాయతీ ఈవో ద్రాక్షాయణి ఆదేశాల మేరకు రోడ్డుకు ఇరువైపులా షాపుల ముందు వేసిన కాంక్రీట్‌ను తొలగించారు. కాలువలపై ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించాలని, లేకుంటే పంచాయతీ సిబ్బందే తొలగిస్తారని ఆమె హెచ్చరించారు. అలాగే కాలేజీ రోడ్డులో ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని ప్రజలు కోరుతున్నారు.

పట్టణ వైశ్యసంఘం కార్యవర్గం ఎన్నిక

● అధ్యక్షుడిగా లాడి శ్రీనివాసరావు


శ్రీనివాసరావు

టెక్కలి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): టెక్కలి మేజర్‌పంచాయతీ వైశ్య సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. ఈ మేరకు సంఘ అధ్యక్షుడిగా లాడి శ్రీనివాసరావు రెండో పర్యాయం ఎన్నికయ్యారు. కార్యదర్శిగా డోకి వేణుగోపాల్, ఉపాధ్యక్షులుగా బోయిన అశోక్, సూర్యారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బెలుసొంటి నాగేశ్వరరావు, కోశాధికారిగా మోనింగి గోవిందరాజులు, సహాయ కార్యదర్శులుగా జామి అనిల్, హర్షవర్ధన్ ఎన్నికయ్యారు. అలాగే టెక్కలి మండల అధ్యక్షుడిగా జామి రమణ య్య, కార్యదర్శిగా దుంప గోవిందరావు, కోశాధికారిగా తంగుడు శంకర్ ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలను వైశ్య సంఘం సీనియర్ నాయకులు జామి నర్సింహమూర్తి, టంకాల గుప్త, డోకి మల్లేసు, నర్సింహమూర్తి, నాగరాజు, డోకి రాజేష్ పర్య వేక్షించారు. ఈ సందర్భంగా వైశ్య సంఘం అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన లాడి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. వైశ్యులను బీసీల్లో చేర్చిన ఘనత టీడీపీలో కింజరాపు కుటుంబానికే దక్కుతుందన్నారు. మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడు చొరవతో వైశ్యులకు న్యాయం జరుగుతుందన్నారు.

వసప నుంచి కుంటిభద్రకు..

● మకాం మార్చిన ఏనుగులు



కొత్తూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): గత ఆరు రోజులుగా వసప గ్రామ తోటల్లో తిష్ట వేసిన నాలుగు ఏనుగులు సోమవారం కుంటి భద్ర గ్రామ తోటలకు మకాం మార్చాయి. పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలం నుంచి ఏనుగుల గుంపు తొలుత కడుము గ్రామంలో ప్రవేశించి ఆ తరువాత వసప గ్రామం చేరుకుని అక్కడి తోటల్లో ఉన్న సంగతి తెలిసిందే. ఈ ఆరు రోజులు రైతులకు కంటి మీద కునుకు లేకుండా ఆందోళనకు గురయ్యారు. పంటలను ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. ఈ ప్రాంతం చల్లగా ఉండడం, వంశధార నదిలో నీరు పుష్కలంగా లభిస్తుండడం, పంటలు ఉండడంతో ఏనుగులు ఇక్కడ ఉన్నాయని అటవీశాఖాధికారులు అంచనా వేస్తు న్నారు. అటవీ ప్రాంతంగా పోలి ఉండడంతో తోటల్లో ఏ మేరకు పంటలను ధ్వంసం చేశాయో తెలియడం లేదని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అటవీ శాఖాధికారులు స్పందించి ఏనుగుల బారి నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

రైలు కింద పడి ఒకరి మృతి

సోంపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బారువ రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని రైలు కిందపడి బారువ యజ్ఞలవీధికి చెందిన నెయ్యిల అశోక్ మృతిచెందాడు. అశోక్‌కు భార్య వసంత ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు పలాస జీఆర్‌పీఎఫ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంతలే టార్గెట్!

(ఐదో పేజీ తరువాయి)

అనుమతి తీసుకోవాలి. వాహనాల విషయంలో సైతం నిబంధనలు పాటించాలి. పశువులు ఎక్కడానికి, దిగడానికి వాహనాలు అనువుగా ఉండాలి. గాలి, వెలుతురు ఉండేలా చూడాలి. వైద్య కిట్లు వాహనంలో అందుబాటులో ఉండాలి. సుదూర ప్రాంతాలకు తీసు కెళ్తున్నట్టు అయితే పశుగ్రాసం ఉంచాలి. అవి నిల్చునే వెసులబాటు ఉండాలి. కానీ ఇవేవీ పాటించిన దాఖాలాలు లేవు. రవాణా విషయంలో కనీస స్థాయిలో కూడా నిబంధనలు పాటించడం లేదు. ఒకే వాహనంలో 40 నుంచి 50 పశువులను కుక్కి తరలిస్తున్నారు. దారిపొడవునా కనీసం వాటికి ఆహారం వేయడం లేదు. దీంతో ఆకలికి, దప్పికతో అలమటించే పశువులు మార్గమధ్యలో మృత్యువాత పడుతున్నాయి. ఇంత జరుగుతున్నా పోలీసులు, పశుసంవర్ధక శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటి కైనా అధికారులు స్పందించి సంతలపై నిఘా పెట్టాల్సిన అవసరం ఉంది.

తనిఖీలు ముమ్మరం

ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు పశువుల అక్రమ రవాణా నియంత్రణపై దృష్టిపెట్టాం. అక్రమంగా పశువులు తరలించే వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. కొన్ని పశువులను గోశాలలకు తరలిస్తున్నాం. హైవేపై తనిఖీలు ముమ్మరం చేశాం. పశువులు తరలించే వాహనాలను తనిఖీ చేస్తున్నాం. అన్నిరకాల అనుమతులు, వ్యవసాయ పనుల నిమిత్తం తరలిస్తున్నారని తేలాక విడిచిపెడుతున్నాం. గ్రామీణ ప్రాంతాలపై సైతం దృష్టి పెట్టాం.

- ఎం.అవతారం, సీఐ, జేఆర్ పురం


ఆ ప్రమాదకర బావిని పూడ్చండి

● ఎంఈవోకి బాలల హక్కుల కమిషన్ చైర్మన్ ఆదేశం


హరిపురం: కేజీబీవీలో భోజన పదార్థాలను పరిశీలిస్తున్న బాలల హక్కుల చైర్మన్

కాశీబుగ్గ/పలాస రూరల్/హరిపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి పెంటిభద్ర గ్రామంలో ప్రభుత్వ పాఠశాలకు ఆనుకొని ఉన్న బావి శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా ఉందని, దీనిని పూడ్చాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు ఎంఈవో సత్యంకు ఆదేశించారు. సోమవారం పెంటిభద్ర, రంగోయి పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, మందస మండలం జీఆర్‌పురం కేజీబీవీని సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. విద్యార్థులు, బాలింతలు, గర్భిణులతో మాట్లాడి ప్రభుత్వం అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అలాగే మధ్యాహ్న భోజనాన్ని పరిశిలించి విద్యార్థులతో మాట్లాడారు. కాశీబుగ్గలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలసదనాన్ని సందర్శించారు. అలాగే జీఆర్‌పురం కేజీబీవీలో విద్యార్థినులతో కలిసి భోజనం చేసి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థినులతో మాట్లాడి శతశాతం ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సమితి చైర్‌పర్సన్ శ్రీలక్ష్మి, సభ్యులు గున్నప్పడు, జిల్లా బాలల రక్షణ అధికారి కేవీ రమణ, సమగ్రశిక్షా జీసీడీవో నీరజ, మందస ఎంఈవోలు మర్రిపాటి లక్ష్మణరావు, నగిరి తారకేశ్వరరావు, ఎస్ఎస్ఏ ఏపీసీ సంపతిరావు శశిభూషణ్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ వాసంతి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను శతశాతం వసూలు చేయాలి


మాట్లాడుతున్న కమిషనర్ రామారావు

పలాస, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పలాస- కాశీబుగ్గ మునిసిపాలిటీలో ఇంటి పన్ను వసూలు ఈనెలాఖరు నాటికి శతశాతం పూర్తి చేయాలని కమిషనర్ ఎన్.రామారావు ఆదేశించారు. సోమవారం తన చాంబర్‌లో సచివాలయాలు, మునిసిపల్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆస్తి పన్ను వసూళ్ల కు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఉత్తరాంధ్ర జిల్లాల్లో పలాసను నెంబర్ వన్ స్థానంలో ఉంచాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వంద రోజుల్లో పారిశుధ్య సమస్యలను గాడిలో పెట్టడంతో పాటు ప్లాస్టిక్ రహిత మునిసిపాలిటీగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్లాస్టిక్‌ను నిషేధించే విషయంలో ప్రజలను చైతన్యం చేయాలన్నారు. డ్వాక్రా సంఘాలు త యారు చేసే గుడ్డ సంచులను వినియోగించేలా ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వం కేటాయించే ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా లబ్ధిదారులకు అవగాహన కలిగిం చాలని, ఇళ్ల నిర్మాణానికి ప్రభు త్వం అదనంగా నిధులు కేటా యించిందన్న విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు.

మండుటెండలో గంటపాటు ట్రాఫిక్ జామ్



జమ్ము జంక్షన్ వద్ద సర్వీసు మార్గంలో నిలిచిన వాహనాలు

నరసన్నపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక జమ్ము జంక్షన్ వద్ద సర్వీసు రోడ్డులో సోమవారం మధ్యాహ్నం ట్రాఫిక్ జామ్ అయింది. స్థానికంగా ఓ ప్రైవేటు పాఠశాలలో పదోతరగతి పరీక్షలకు సంబంధించి రెండు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో 424 మంది విద్యార్థులను పరీక్షలకు కేటాయించారు. పరీక్ష అనంతరం ఒకేసారి విద్యార్థులంతా బయటకు రావడం, సర్వీసు మార్గంలో టెక్కలి నుంచి నరసన్నపేట పట్టణంలోకి వచ్చే వాహనాలతో సుమారు గంటపాటు ట్రాఫిక్ జామ్ అయి విద్యార్థులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఒకపక్క ఎండతీవ్రత అధికంగా ఉండడం మరో పక్క ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోవడంతో అవస్థలు పడాల్సి వచ్చింది. పరీక్షలు రాసిన అనంతరం విద్యార్థులు ఇళ్లకు చేరేందుకు ఎండలో ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

డీఏ, పీఆర్సీ బకాయిలను విడుదల చేయాలి


పాతపట్నం: తహసీల్దార్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న రిటైర్డ్ ఉద్యోగుల సంఘ నేతలు

నరసన్నపేట/పాతపట్నం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగుల డీఏ, పీఆర్సీ బకాయిలను తక్షణం విడుదల చేయాలని ఆ సంఘ నేతలు కోరారు. ఈ మేరకు సోమవారం నరసన్నపేట, పాతపట్నం తహసీల్దార్లు సత్య నారాయణ, కిరణ్‌కుమార్‌లకు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈహెచ్‌ఎస్ కార్డులపై నగదు రహిత వైద్యాన్ని పూర్తి స్థాయిలో అందించాలని కోరారు. 2023 జూలై నాటికి పీఆర్సీ ఏర్పాటు చేయాల్సి ఉన్నా ఇప్పటి వరకు ఏర్పాటు చేయలేదన్నారు. 12వ పీఆర్సీని తక్షణం వేయాలన్నారు. కార్యక్రమాల్లో రిటైర్డ్ ఉద్యోగుల సంఘ నాయ కులు ఎస్.ప్రభాకరరావు, జె.రామారావు, వి.రామారావు, బీఏ రామారావు, రేగేటి ఆనందరావు, వైఎస్ ప్రకాశ్, పి.మోహన రావు, బి.సింహాచలం పాల్గొన్నారు.

శక్తి యాప్‌ను వినియోగించుకోండి



మాట్లాడుతున్న ఎస్‌ఐ బాలకృష్ణ

టెక్కలి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణ కోసం ప్రభుత్వం అమలు చేసిన శక్తి యాప్‌ను అవసరమైనప్పుడు వినియోగించుకోవాలని ఎస్‌ఐ బాలకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శక్తి యాప్‌పై విద్యార్థి నులకు అవగాహన కలిగించారు. మహిళలకు రక్షణ కవచం ఈ శక్తి యాప్ అని, కష్టకాలంలో కొన్ని సందర్భాల్లో అనుకోకుండా వచ్చే ఇబ్బందుల్లో ఈ యాప్ ఉపయోగపడుతుంద న్నారు. ప్రతి ఒక్కరు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సతీష్ కుమార్, సిబ్బంది ప్రసాదరావు, జ్యోతి, రాజేశ్వరి, కుసుమ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఈఎంయూ పునరుద్ధరణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వజ్రపు కొత్తూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): విశాఖ-పలాస ఈఎంయూ పాసింజర్ రైలును ఎట్టకేలకు సోమవారం మధ్యాహ్నం పలాస వరకు పునరుద్ధరించారు. ఈ రైలు కుంభమేళా తరువాత విశాఖ నుంచి శ్రీకాకుళం వరకే నడుపుతున్న విషయాన్ని, ప్రయాణికుల ఇబ్బందులు సోమవారం 'ఆంధ్రజ్యోతి' లో 'ఈఎంయూ రైలును పునరుద్ధరించండి' శీర్షికతో కథనం వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రైల్వే ఉన్నతాధికారులు స్పందించి రైలును పలాస వరకు పొడిగించారు. ప్రతిరోజు ఉదయం 8 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరి మధ్యాహ్నం ఒంటి గంటకు పలాస చేరుకుంటుంది. తిరిగి మధ్యాహ్నం 1-30 గంటలకు పలాసలో బయలుదేరి సాయంత్రం 6 గంటలకు విశాఖ చేరుకుంటుందని అధికారులు తెలి పారు. ఎటకేలకు ఈఎంయూ రైలు పునరుద్ధరించడంపై ఈ ప్రాంతీయులు హర్షం వ్యక్తంచేశారు.

గ్రూప్-2 అభ్యర్థులకు న్యాయం చేయండి

టెక్కలి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 అభ్యర్థుల మనోవేదనను అర్థం చేసుకొని వారికి న్యాయం చేయాలని జై భారత్ నేషనల్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బైపల్లి పరమేశ్వరరావు కోరారు. ఈ మేరకు సోమవారం ఆర్డీవో ఎం. కృష్ణమూర్తికి వినతిపత్రం అందించారు. రాష్ట్రంలో 92 వేల మందికి పైగా నిరు ద్యోగులు, వారి కుటుంబాలు నిరీక్షిస్తున్నాయన్నారు. ఏపీపీఎస్సీ గ్రూప్-2 అభ్యర్థుల నోటిఫికేషన్లు, ప్రభుత్వ ఉత్తర్వులు 436, 77 వల్ల ఏర్పడిన అనిశ్చితిని తొలగించి నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరారు.

ఓటర్ల తొలగింపుపై నివేదిక ఇవ్వండి

నరసన్నపేట, మార్చి 17(ఆంధ్రజ్యోతి): గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉన్న ఓటర్లు ఎందుకు తగ్గారో నివేదిక ఇవ్వాలని రాజకీయ పార్టీల నాయకులు ఆర్వో లావణ్యను కోరారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆర్వో సోమవారం రాజకీయపార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. సుమారు 8 వేల ఓట్లు తొలగింపు ఎందుకు జరిగింది. ఏ పోలింగ్ కేంద్రాల్లో ఎన్ని ఓట్లు తొలగించారన్న వివరాలు ఇవ్వాలని టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన కోరారు. సమావేశంలో నాలుగు మండలాల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం

ఎల్.ఎన్.పేట, మార్చి 17(ఆంధ్రజ్యోతి): వాడవలస గ్రామంలో కోదండ రామ మందిర ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠోత్సవంలో భాగంగా సోమవారం సీతారాముల కల్యాణం కనులపండువగా నిర్వహించారు. పురోహితుడు రేజేటి జగన్నాథశర్మ ఆధ్వర్యంలో విశేష కార్యక్రమాలు చేపట్టారు. శనివారం ప్రారంభమైన ఈ ఉత్సవాల్లో మూడు రోజుల పాటు సామూహిక కుంకుమ పూజలు, విగ్రహ ప్రతిష్ఠ, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలను నిర్వహించారు. సోమవారం శాంతి కల్యాణంతో ఉత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున గ్రామస్థులు పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

లారీ బోల్తా

హిరమండలం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): హిరమండలం సుభలయ గ్రామం వద్ద సోమవారం లారీ బోల్తాపడింది. పాతపట్నం నుంచి శ్రీకాకుళం వెళుతుండగా ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి పక్కన ఉన్న పంట పొలంలో బోల్తా పడింది. అయితే ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

రేపు సామాజిక తనిఖీ ప్రజావేదిక

పలాసరూరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలో చేపట్టిన ఉపాధి హామీ పనులపై బుధవారం 17వవిడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఏపీవో శంకరరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, వేతనదారులు హాజరుకావాలని కోరారు.